

విజయపురం.. అక్రమ క్వారీల కేంద్రం

విజయపురం మండలంలో గ్రావెల్ అక్రమ క్వారీలు ఎక్కువయ్యాయి. పరిసరాల్లోని కొండలను తవ్వి తమిళనాడుకు తరలించేస్తున్నారు. - 8లో



హోటళ్లకు జరిమానా

పుత్తూరులో పలు హోటళ్లకు మున్సిపల్ కమిషనర్ జరిమానా విధించారు. - 8లో



మెడికల్ దందాపై దాడులు

జీడీనెల్లూరులో మెడికల్ షాపుల్లోనే వైద్యం చేస్తుండడంతో డీఎంహెచ్ఓ దాడులు నిర్వహించారు. - 8లో

సాక్షి చిత్తూరు

బుధవారం । 31 । జులై । 2024

న్యూస్‌రీల్

ఈవీఎంల గోదాము పరిశీలన



ఈవీఎంల గోదాము వద్ద రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: ఈవీఎంల గోదామును జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లోని గోడౌన్‌లో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈవీఎంలను పరిశీలిస్తామని తెలిపారు. గోదాము వద్ద సీసీ కెమెరాలతో నిఘా, పటిష్ట భద్రత ఉండాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్, అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు జరిమానా



చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కో వ్యక్తికి రూ.పది వేల చొప్పున 17 మందికి జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 17 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.70 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఎనిమిది నెలల కాలంలో 240 మందికి దాదాపు రూ.17.80 లక్షల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నా భర్త అరెస్ట్ అన్యాయం

- గొడవలకు సంబంధం లేకపోయినా అరెస్టు చేశారంటూ బాధితురాలి ఆవేదన



వినతిపత్రాన్ని చూపుతున్న మంజుల

చిత్తూరు కలెక్టరేట్: బాధ్యతగా వ్యవహరించాల్సిన పోలీసులు గొడవలకు ఎటువంటి సంబంధం లేని తన భర్తను అన్యాయంగా అరెస్టు చేశారంటూ పుంగనూరు నియోజకవర్గం, సదుం మండలం, ఎర్రాతివారిపల్లెకు చెందిన దళితమహిళ కె.మంజుల ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో తమ గ్రామంలో రాజకీయ గొడవలు జరిగాయన్నారు. ఆ గొడవల్లో తమ గ్రామంలో పలువురి పైన కేసులు పెట్టారని తెలిపారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న తమకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని, తన భర్త మణిని పోలీసులు అన్యాయంగా అరెస్టు చేసి జైలుకు పంపించారని కన్నీరు పెట్టుకున్నారు. తమ గ్రామంలో 'మణి' పేరుతో ముగ్గురు ఉన్నారని, ఆవుల మణిపై కేసు పెట్టి సంబంధం లేని తన భర్త కె.మణిని పోలీసులు అరెస్టు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. అరెస్టు చేసే ముందు ఆధారాలు పరిశీలించకుండా పోలీసులే తప్పుచేశారని ఆమె పేర్కొన్నారు. ఈ విషయం చిత్తూరు ఎస్పీ మణికంఠను కలిసి చెబుదామని వెళితే అక్కడ ఉన్న పోలీసులు తనను లోనికి వెళ్లనివ్వలేదనీ, గత్యంతరం లేక కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు ఆమె వివరించారు. ఈ ఘటనపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పోలీసులు న్యాయం చేయలేని పక్షంలో బాధితురాలి పక్షాన ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నాయి.

గుడివంక ఆలయ ఆదాయం రూ.26.26 లక్షలు

గుడుపల్లె: గుడివంక శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రమణ్యస్వామి బ్రహ్మోత్సవాలలో ఆలయానికి రూ.26,26,611 ఆదాయం వచ్చిందని ఈఓ చలపతి తెలిపారు. మంగళవారం గుడివంక ఆలయం వద్ద బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. వారం రోజులుగా జరిగిన బ్రహ్మోత్సవాలలో ఆలయానికి వివిధ రూపాలలో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. హుండీలో రూ.14,58,453, లడ్డు ప్రసాదం ద్వారా రూ.5,10,000, తలనీలాల ద్వారా రూ.2 లక్షలు, అంగళ్లు గేటు, కోళ్లు, గొర్రెలు ఇతరాల ద్వారా మిగతా మొత్తం వచ్చిందని ఆలయ ఈఓ చలపతి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కమలాకరన్, భాస్కర్‌రెడ్డి, నాయకులు బాబు నాయుడు, రాజగోపాల్, హేమాంబరగౌడు, ఆలయ అర్చకులు వీరశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.



రైలు బండి.. ఆగదండి!

చిత్తూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

బోగీల కొరత, అరకొరగా వచ్చే రైళ్లతో చిత్తూరువాసులు అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రమైనప్పటికీ చాలా రైళ్లకు స్టాపింగ్ ఉండకపోవడంతో రైలు ప్రయాణంపై ఆధారపడడం మానేస్తున్నారు. రోజుకు 32 రైళ్ల రాకపోకలు. వీటిలో సూపర్ ఫాస్ట్ నుంచి ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్, మెము రైళ్లు ఉన్నాయి. సగటున రోజుకు ఆరు వేల మంది ఇక్కడి నుంచి ప్రయాణం చేస్తుంటే రూ.3 లక్షల వరకు రైల్వేశాఖకు ఆదాయం వస్తోంది. ఇక్కడ రైలు ప్రయాణం మారుమూల పల్లెటూరును తలపిస్తోంది.

– చిత్తూరు అర్బన్/ చిత్తూరు కార్పొరేషన్

- జిల్లా కేంద్రంలో అరకొరగా నడుస్తున్న రైళ్లు
- కలగా మారిన చిత్తూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు
- రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికులు
- చాలీచాలని బోగీలతో నరకం

చిత్తూరు రైల్వే స్టేషన్ దశాబ్దాల కాలంగా అభివృద్ధికి, కనీస వసతులకు నోచుకోకుండా వెలవెలబోతోంది. తిరుపతి రైల్వే స్టేషన్‌తో పోలిస్తే ప్రయాణికుల అవసరాలు, మౌలిక వసతులు, సదుపాయాల కల్పనపై పాలకులు పది శాతం కూడా పట్టించుకోవడంలేదు. ప్రతీ ఏటా ప్రవేశపెట్టే రైల్వే బడ్జెట్‌లో చిత్తూరు మీదుగా కొత్త రైళ్లు వెళ్లకపోయినా, డబ్లింగ్ పనులకు బడ్జెట్ కేటాయించి ఇప్పటి వరకు కనీసం సర్వే జరగపోయినా ప్రజలు క్షమిస్తూనే ఉన్నారు. అయితే చిత్తూరు మీదుగా వెళ్లే రైళ్లను ఇక్కడ ఆపకుండా వెళ్లడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు మీదుగా వెళుతున్న 32 రైళ్లలో ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలతోపాటు కాట్పాడి, చిత్తూరు, తిరుపతి మధ్య ప్రయాణం చేసేవారి సంఖ్య రోజుకు 50 వేల నుంచి లక్ష వరకు ఉంది. కేవలం చిత్తూరు స్టేషన్ నుంచి వెళ్లేవారి సంఖ్య మాత్రమే 6 వేల వరకు ఉంటే ఇక్కడ పలు రైళ్లు ఆగడం లేదు. ఉన్న రైళ్లల్లో అదనపు బోగీలు పెట్టకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

ఉత్తర, దక్షిణ ప్రయాణం

చిత్తూరులో రైల్వే స్టేషన్ ఉన్నప్పటికీ పలు రైళ్లు ఆపడం లేదు. దీంతో సమీపంలో ఉత్తరాన ఉన్న తమిళనాడులోని కాట్పాడి స్టేషన్‌కు వెళుతున్నారు. కాట్పాడి జంక్షన్ నుంచి పలు రైళ్లలో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. కాట్పాడి తరువాత చిత్తూరువాసులు దక్షిణం వైపు ఉన్న పాకాల స్టేషన్‌కు వెళుతున్నారు. భీమవరం, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే కొన్ని రైళ్లను పాకాలకు వెళ్లి ఎక్కాల్సిన పరిస్థితి. ఇక హైదరాబాద్, కాకినాడ, షిరిడీ, కోల్‌కతా తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వచ్చినపుడు స్లీపర్ క్లాస్ నుంచి ఏసీ టికెట్ వరకు బుక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తే 30 రోజులకు ముందే వెయిటింగ్ లిస్టు చూపిస్తోంది. తత్కాల్ కోటా కింద బుక్ చేసుకోవడానికి ప్రయత్నించినా క్యూలో పట్టుమని పది మందిని దాటుకుని వెళ్లేలోపే టికెట్లు అయిపోతున్నాయి. ప్రైవేటు ఏజెన్సీ వ్యక్తులు ఇదే అదునుగా ఒక్కో టికెట్టుపై రూ.50 నుంచి 200 వరకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు.



శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో సీటు లేక ప్రయాణికుల కష్టాలు

అదనపు బోగీలపై ఆశ

జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను జంక్షన్‌గా ప్రకటించకపోవడంతోనే పలు రైళ్లు ఆగడం లేదు. శేషాద్రి, కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలు పెట్టాలనే డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను మూడో ప్లాట్‌ఫాం మీద ఉంచడంతో వృద్ధులు, మహిళలు, గర్భిణీలు అక్కడ వెళ్లి ఎక్కాలంటే తిప్పలు పడుతున్నారు. నగరంలోని మహావీర్ బ్రిడ్జి కింద 30 ఏళ్ల క్రితం ఉన్న అండర్ బ్రిడ్జిని పునర్నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య కూడా తీరే అవకాశం ఉంది.

వైఎస్సార్ సీపీ హయాంలో..

చిత్తూరు రైల్వేస్టేషన్ అభివృద్ధిపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సముచిత న్యాయం జరిగిందనే చెప్పాలి. గడిచిన ఐదేళ్లల్లో అప్పటి ఎంపీ రెడ్డెప్ప, నాటి బీజేపీ ప్రభుత్వంలో పార్లమెంటు ప్యానెల్ స్పీకర్‌గా ఉన్న పీవీ మిథున్ రెడ్డి ఇక్కడి సమస్యలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఫలితంగా అమృత్ భారత్ పథకానికి చిత్తూరు రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేశారు. ఈ పథకంలో రూ.14 కోట్ల నిధులు మంజూరయ్యాయి. స్టేషన్ ఆధునికీకరణ పనులు, నూతన ప్లాట్‌ఫామ్, స్టేషన్‌కు రెండు వైపులా కొత్త రోడ్లు, దివ్యాంగులకు ప్రత్యేక మార్గాలు, ఉచిత 5 జీ సేవలు, లిఫ్టు తదితర పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందుగానే ఎంపీల నుంచి కేంద్రం రిక్వెస్ట్ లెటర్లు కోరుతుంది. చిత్తూరు మీదుగా కొత్త రైళ్లు కోరకున్నా, ఇటువైపు వెళుతున్న రైళ్లను ఆపడానికి ఇపుడున్న ఎంపీ ప్రయత్నించాల్సి ఉంది. దీనికి తోడు చిత్తూరు నుంచి చెన్నైకు నేరుగా రైలు నడిపే అంశాన్ని కూడా ప్రతిపాదిస్తే ఇక్కడి ప్రజలకు మేలు జరుగుతుంది. రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.





చిత్తూరు రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

చిత్తూరులో ఆగని రైళ్లు ఇవే.....

(రైలు నెం: 1283-84)
యశ్వంత్‌పూర్-హౌరా
హౌరా-యశ్వంత్‌పూర్

(రైలు నెం:16382-83)
కన్యాకుమారి-ముంబయి,
ముంబయి కన్యాకుమారి

(రైలు నెం:16779-80)
రామేశ్వరం-తిరుపతి,
తిరుపతి-రామేశ్వరం

(రైలు నెం:16733-34)-
రామేశ్వరం-ఓకా,
ఓకా-రామేశ్వరం

(రైలు నెం:1289-90)
యశ్వంత్‌పూర్ -టాటానగర్,
టాటా-యశ్వంతపూర్

(రైలు నెం:12867-68)
పుదుచ్చేరీ-హౌరా
హౌరా - పుదుచ్చేరీ

నరకం కనిపిస్తోంది



కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను మూడో ప్లాట్‌ఫాంపై పెడుతున్నారు. దీని వల్ల అంతదూరం వెళ్లి ఎక్కడం చాలా కష్టంగా ఉంది. 15 రోజుల ముందు టికెట్ బుక్ చేసుకోవాలని చూస్తే అప్పటికే వెయిటింగ్ లిస్ట్ చూపిస్తోంది. జనరల్ బోగీ ఎక్కితే మరుగుదొడ్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి. రిజర్వేషన్ లేకుండా రైళ్లు ఎక్కాలంటేనే నరకం కనిపిస్తోంది.

– హేమంత్, చిత్తూరు

అదనపు బోగీలు పెట్టాలి..



చిత్తూరు మీదుగా నడిచే శేషాద్రి, కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లకు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటోంది. ఈ రెండు రైళ్లలో స్లీపర్, జనరల్ కేటగిరీలో అదనపు బోగీలను ఏర్పాటు చేయాలి. ఉద్యోగులు రోజూ ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లు ఎక్కువసేపు నిలపడం లేదు. ఈ రైళ్లకు కనీసం 5 నిమిషాలు స్టాపింగ్ సమయం ఇస్తే బాగుంటుంది.

– గణపతి, చిత్తూరు

అంతా గోప్యమే..

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కొందరు అధికారుల తీరు ఇష్టారాజ్యంగా మారింది. ఇప్పటికే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు అధికారులు వారి స్థానాలను పదిలంగా కాపాడుకోవడానికి, 'పచ్చ' భక్తి చాటుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు. ఇందులో భాగంగా కార్పొరేషన్ పాలకవర్గం స్టాండింగ్ కమిటీ ఎన్నికల వ్యవహారాన్ని అత్యంత రహస్యంగా ఉంచారు. కనీసం ఎన్నికల నోటిఫికేషన్‌ను మీడియాకు కూడా విడుదల చేయలేదు. విషయం బయటకు పొక్కడంతో గోప్యంగా ఏకగ్రీవం చేద్దామనుకున్న అధికారులకు ప్రస్తుతం గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయ్యింది.

- స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై ఇష్టారాజ్యం
- మీడియాకు నోటిఫికేషన్ కూడా ఇవ్వని వైనం
- 'పచ్చ' భక్తి కోసం ఏకగ్రీవమే లక్ష్యం
- ఇదీ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ తీరు
- ఐదు స్థానాలకు ఎనిమిది మంది పోటీ
- నేడు కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్నికలు



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్ : ప్రస్తుతం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గంలో మేయర్‌తో కలిపి 50 మంది కార్పొరేటర్లు, ఎక్స్–అఫిషియో సభ్యులుగా చిత్తూరు, పూతలపట్టు శాసన సభ్యులు, ఐదుగురు కో–ఆప్షన్ సభ్యులు ఉన్నారు. పాలకవర్గం గడువు మరో 14 నెలల కాలం ఉంది. ఇప్పటికే 24 మంది వరకు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను టీడీపీ నేతలు తమ పార్టీలో చేర్చుకోవడం, వాళ్లను వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేయడం తెలిసిందే. అయితే పాలకవర్గంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా మేయర్ యథావిధిగా కొనసాగుతారు. మేయర్ కాకుండా మరో ఐదుగురు కార్పొరేటర్లు కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధికారులు అనుకున్నదే అదనుగా ఈ నెల 6వ తేదీన స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు కాగితాల్లో చూపించారు. దీనిప్రకారం ఈ నెల 8 నుంచి 14 వరకు నామినేషన్ల స్వీకరణ, అదే రోజున నామినేషన్లు దాఖలు చేసిన వారి జాబితా, 15న పరిశీలన, తుది ప్రచురణ, 17వ తేదీ వరకు ఉప సంహరణ, 26న ఎన్నిక, అదే రోజున ఫలితాల వెల్లడి అంటూ ఓ కాగితాన్ని అధికారులు నోటీస్ బోర్డులో ఉంచారు. అసలు నామినేషన్లు ఎవరు వేశారు, ఎవరు ఉప సంహరించుకున్నారు, పోటీలో ఎవరు ఉన్నారనే విషయం కూడా మీడియాకు తెలియనీకుండా అధికారులు గోప్యత పాటిస్తున్నారు. నోటిఫికేషన్ ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరగాల్సిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలను అధికారులు ఇలా ఏకపక్షంగా, మీడియాకు సైతం చెప్పకుండా అత్యంత రహస్యంగా నిర్వహించాలని ప్రయత్నించడంపై విమర్శలు వస్తున్నాయి. ఎన్నికను ఏకగ్రీవం చేయడానికి ప్రయత్నించిన అధికారులకు అదనంగా నామినేషన్లు వేసిన ముగ్గురు కార్పొరేటర్లు కొరకరాని కొయ్యగా మారారు. ఐదు స్థానాలకు ఎనిమిది మంది కార్పొరేటర్లు నామినేషన్లు వేయడంతో ఎన్నికలు అనివార్యంగా మారాయి. దీంతో ఆగస్టు 1వ తేదీన కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు కార్పొరేటర్లకు సమాచారం పంపారు. దీనిపై రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ సంచాలకులు హరినాయణన్‌కు రాత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేయడానికి పలువురు కార్పొరేటర్లు సిద్ధమైనట్లు సమాచారం.

పోటీలో ఉన్నవాళ్లు

నామినేషన్లు వేసిన వాళ్ల వివరాలు, తుదిగా పోటీలో ఉన్న వారి వివరాలను కూడా కార్పొరేషన్ అధికారులు ఎవ్వరికీ చెప్పలేదు. కనీసం నోటీస్ బోర్డులో కూడా ప్రచురించలేదు. దీనిపై సహాయ కమిషనర్ రామకృష్ణుడును వివరణ కోరగా 'స్టాండింగ్ కమిటీ ఫైలు కమిషనర్ చూస్తున్నారు. ఎవరెవరు పోటీలో ఉన్నారో తెలియదు. అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో 26న జరగాల్సిన ఎన్నికను ఆగస్టు 1వ తేదీకు పెడుతున్నాం' అని సమాధానమిచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు వైఎస్సార్ సీపీ తరఫున డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మధుబాబు, శోభ పోటీ చేస్తుండగా.. టీడీపీ నుంచి రాజేష్‌కుమార్‌రెడ్డి, అశోక్‌కుమార్, శశికుమార్, రేష్మ, జనసేన నుంచి నిర్మల పోటీ చేస్తున్నారు.

సరైన పద్ధతి కాదు

స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిర్వహిస్తారు. ఈ నెల 6వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చామని చెబుతున్న అధికారులు, అదే రోజు మీడియా ఎదుట వివరాలు తప్పకుండా చెప్పాలి. కనీసం ఎన్నిక జరిగే తేదీని కూడా మీడియాకు చెప్పలేదంటే అధికారులు గోప్యత పాటిస్తున్నారని తెలుస్తోంది. ఇది సరైన పద్ధతి కాదు.

– ఆర్.చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాల్లో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్ర నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా డివిజన్ల వినియోగదారులు సమస్యలను తెలపాలన్నారు. వాటిని నమోదు చేసుకుని పరిష్కారం కోసం అధికారులు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి ఫిర్యాదులు తీసుకుంటారని వివరించారు.

డ్వాయ్ యాప్‌తో రూ.6.06 కోట్ల మోసం



కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేస్తున్న డాయ్ బాధితులు

- రెండు రోజుల్లో 373 ఫిర్యాదులు
- ఇంకా ఆన్‌లైన్‌లో పలువురు ఫిర్యాదు
- ముగిసిన జిల్లా కమిటీ ఫిర్యాదుల స్వీకరణ
- నేటి నుంచి పలమనేరు పీఎస్‌లోనూ ఫిర్యాదులు ఇవ్వొచ్చు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో డాయ్ యాప్‌లో 373మంది రూ.6.06 కోట్ల దాకా మోసపోయారని మెప్మా పీడీ రాధమ్మ తెలిపారు. ఇటీవల జరిగిన డాయ్ యాప్ అక్రమాలపై విచారణ, ఫిర్యాదుల స్వీకరణ కోసం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. మెప్మా పీడీ రాధమ్మ ఆధ్వర్యంలోని కమిటీ రెండు రోజుల నుంచి ఫిర్యాదులు స్వీకరించింది. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కమిటీ సభ్యులు బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ రెండు రోజుల్లో 373 మంది ఫిర్యాదు చేయగా వీరు మోసపోయిన మొత్తం రూ.6.06 కోట్లుగా లెక్కగట్టారు. ఇందుకు కారణమైన ఆపరేటర్ రాజేష్, సహకరించిన ఆర్పీలపై చర్యలు తప్పకుండా తీసుకుంటామని మెప్మా పీడీ తెలిపారు.



బాధితుల నుంచి వివరాలు అడుగుతున్న పోలీసులు, పీడీ రాధమ్మ

చీటింగ్ కేసు నమోదు చేశాం

సీఐ మాట్లాడుతూ అందిన ఫిర్యాదులపై సైబర్‌క్రైంతో పాటు చీటింగ్ కేసులు నమోదు చేశామని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ వ్యవహారంలో కీలక వ్యక్తి రాజేష్ అని, అతని ప్రోద్బలంతో ఆర్పీలు, గ్రూపు మహిళలు భారీగా చైన్‌లింక్ ఏర్పడడంతో వ్యాపారం జోరందుకున్నట్టు తెలిసిందన్నారు. గత సోమవారం యాప్ డిలీట్ అయ్యేనాటికి ముందు శని, ఆదివారాల్లో పది వేలకు రూ.20 వేలని మెసేజ్ రావడంతో చాలామంది ఎక్కువ మొత్తంలో డబ్బులు వేశారని తెలిపారు. ఇప్పటిదాకా తమకు ఫిర్యాదు చేస్తున్న వారు ఎక్కువ మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్న వారేనని, చిన్న మొత్తాలు పోయినవారు రావడం లేదన్నారు. వీరు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. లేదా 1903 నెంబరుకు కాల్ చేసి ఆన్‌లైన్‌లోనూ పిర్యాదు చేసుకోవచ్చునని తెలిపారు.

క్లుప్తంగా

కారు బోల్తా



వెదురుకుప్పం: ఎర్రగుంట సమీపంలోని రాజబావి కనుమ వద్ద మంగళవారం ఉదయం ఓ కారు బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు... తిరుపతి నుంచి విధులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులు కారులో బయల్దేరారు. రాజబావి కనుమ వద్ద అదుపు తప్పి గుట్టను ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. కారులో ఉన్న ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

కుప్పం డీఎస్పీ బదిలీ

కుప్పం: కుప్పం డీఎస్పీ బీ.శ్రీనాథ్‌ను బదిలీ చేస్తూ డీజీపీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఆమేరకు శ్రీనాథ్‌ను వెంటనే రిలీవ్‌చేయాలని చిత్తూరు జిల్లా ఎస్పీకి ఆదేశాలిచ్చారు.

కపిలేశ్వరాలయంలో ఆడికృత్తిక వేడుకలు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపించారు. పాలు, పెరుగు, తేనె, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం మూలవర్లకు విశేషాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం జరిపించారు.

విజయపురం
అక్రమ క్వారీల కేంద్రం


అక్రమ క్వారీలకు విజయపురం మండలం నిలయంగా మారింది. విజయపురం మండలం పరిసరాల్లో కొండలు ఎక్కువగా ఉన్నాయి. ఈ కొండల్లో నాణ్యమైన గ్రావెల్ దొరుకుతుంది. సమీపంలోని తమిళనాడులో ఈ గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉంది. దీంతో రాష్ట్రస్థాయి నుంచి మండలం వరకు ప్రతి నాయకుడి కన్ను ఈ దందాపైనే పడుతుంది. అధికార బలం ఉంటే చాలు క్వారీలకు నామమాత్రపు అనుమతి తీసుకొచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అనుమతుల మాటున అక్రమ క్వారీల తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. దీంతో పచ్చదనంతో ఉన్న కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. వీటిని నిలువరించడానికి స్థానిక నాయకులు ఎంతో పోరాటం చేస్తున్నా అక్రమ తవ్వకాలను అడ్డుకోలేకపోతున్నారు.



హిటాచీతో లారీకి గ్రావెల్ లోడింగ్

- నామమాత్రపు అనుమతులతో గ్రావెల్ తవ్వకాలు
- అక్రమ క్వారీలకు నిలయంగా విజయపురం పరిసరాలు
- అంతరించిపోతున్న గుట్టలు, కొండలు
- కోట్లు దండుకుంటున్న క్వారీల యజమానులు

విజయపురం : క్వారీ అనే పదం వినడానికి సింపుల్‌గా ఉన్నా.. కోట్లలో వ్యాపారం సాగుతోంది. ఒక్కసారి పేరుకో పర్మిట్ తీసుకుంటే కోట్లకు పడగలెత్తవచ్చు. అనుమతి ఇచ్చిన ప్రభుత్వానికి వేలల్లో ఆదాయం వస్తే, వ్యాపారికి కోట్లలో ఆదాయం



మహారాజపురం కొండ

వస్తుండడం విశేషం. దీంతో క్వారీ అనుమతి కోసం కింద స్థాయి నుంచి పై స్థాయి వరకు ఎన్ని లక్షలు ఇవ్వడానికైనా వెనుకాడడం లేదు.

తమిళనాడులో గ్రావెల్ తవ్వకంపై నిషేధం

తమిళనాడులో గ్రావెల్ తవ్వకాలపై పూర్తిగా నిషేధం ఉంది. దీంతో తమిళనాడులో ఇళ్లు, ఫ్యాక్టరీలు, రోడ్ల నిర్మాణానికి అవసరమైన గ్రావెల్ దొరకడం కష్టంగా మారింది. దీంతో తమిళనాడుకు చెందిన కొందరు అక్రమ వ్యాపారుల కన్ను ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన విజయపురం మండలంపై పడింది. ఈ ప్రాంతానికి చెందిన కొందరు రాజకీయ నాయకులతో చేతులు కలిపి గ్రావెల్ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. నామమాత్రపు అనుమతులు తీసుకొని, రాత్రీపగలు తేడా లేకుండా మట్టి తరలించేస్తున్నారు. పచ్చదనంతో నిండి ఉన్న కొండలు, గుట్టలు సైతం మాయమై పోతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే మరో దశాబ్ద కాలంలో కొండలు పూర్తిగా కనుమరుగవడం ఖాయమని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా మారిన క్వారీ గుంతలు

కొన్నేళ్లుగా చేపట్టిన క్వారీల తవ్వకాలలో ఏర్పడిన గుంతలు ప్రస్తుతం ప్రమాదకరంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో అనుమతికి మించి తవ్వేయడంతో వర్షపు నీరు నిలిచి గుంతలుగా మారి ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిపై అధికారులు దృష్టి పెట్టకపోతే ప్రమాదాలు తప్పవని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఫలితమివ్వని పోరాటాలు

అక్రమ క్వారీలను నిలుపుదల చేయాలని చాలా సంవత్సరాలుగా స్థానిక ప్రజలు పోరాడుతున్నారు. తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో వాహనాలను అడ్డుకోవడం, రోడ్డుపై బైఠాయించి ధర్నాలు చేయడం చేస్తూనే ఉన్నారు. కానీ అధికారుల్లో మాత్రం ఎలాంటి మార్పులు రాలేదు. మండలం నుంచి జిల్లా స్థాయి వరకు వినతులు ఇచ్చినా వాటిని ఆపలేకపోతున్నారు. దీంతో అక్రమ క్వారీల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతూనే ఉంది. ఫలితంగా కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. దీనికి ఎప్పుడు అడ్డుకట్ట వేస్తారో తెలియడం లేదు.



క్వారీలు నిలిపివేయాలని ధర్నా చేస్తున్న విజయపురం గ్రామస్తులు (ఫైల్)

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

ఎన్పీకుంట (సత్యసాయి జిల్లా): ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. మండెంవారిపల్లి క్రాస్ వద్ద మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో అదే గ్రామం నుంచి స్కార్పియో వాహనం, 4 ద్విచక్ర వాహనాల్లో వస్తున్న కొందరు పోలీసులను చూసి, వాహనాలను వదిలి పారిపోయారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే వారిని వెంటాడి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎగువమూలపల్లికి చెందిన యోగీశ్వరనాయుడు, కర్ణాటకలోని హసకల్ తాలూకా సర్జాపురా నివాసి వి.సునీల్‌కుమార్, ఉస్కర్ గ్రామానికి చెందిన ఎం.చిన్నరాజ్, బెంగళూరులోని బొమ్మనహల్లికి చెందిన ఆల్బర్ట్, చిత్తూరు వాసి హేమచంద్ర ఓ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి, తక్కువ ధరతో విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఈ ముఠాకు నాయకుడిగా యోగీశ్వరనాయుడు వ్యవహరించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 29న తెల్లవారుజాము 3 గంటల సమయంలో ముఠా సభ్యులను తన స్కార్పియో వాహనంలో యోగీశ్వరనాయుడు తీసుకెళ్లాడు. ఎన్పీ కుంట మండలం కొట్టంవారిపల్లిలో రోడ్డు పక్కన ఇంటి ఎదుట ఆపిన ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ఇంట్లో వారు బయటకు రావడంతో ఇనుప రాడ్లు చూపి చంపుతామని బెదిరించారు. దీంతో కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పరారవుతూ మండెంవారిపల్లి క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల్లో ఇద్దరు పరారయ్యారు. కొట్టంవారిపల్లిలో చోరీ చేసిన ద్విచక్ర వాహనానికి సంబంధించి బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి, వాహనాన్ని అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పని కావాలంటే కమీషన్ ఇవ్వాల్సిందే!

– మెప్మా పీడీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా ఆర్పీలు ఏ పని చేయాలన్నా కమీషన్లు ఇవ్వాల్సిందేనని జెండామతం సూర్యాంజలి సంఘ సభ్యురాలిగా ఉన్న ఖైరున్నీసా మంగళవారం మెప్మా పీడీ రాధమ్మకు ఫిర్యాదు చేసింది. తాను గ్రూపులో సభ్యురాలిగా ఉంటూ ఇంటి నిర్మాణం కోసం రుణం కోరితే ఇవ్వలేదన్నారు. ఏదైనా లోన్ కావాలంటే వారికి రూ.600 కమీషన్‌గా ఇవ్వాలని ఆరోపించారు. ఏదైనా ఆర్పీని ప్రశ్నిస్తే గ్రూపు లీడర్లను కలుపుకొని ఓ అజెండా రాసి గ్రూపు నుంచి తీసేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను విచారించనున్నట్లు పీడీ తెలిపారు. కాగా ఇదే గ్రూపునకు చెందిన లీడర్లు మున్సిపల్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ తమ ఆర్పీలు చాలా మంచి వారని ఎలాంటి కమీషన్లు తీసుకోవడం లేదన్నారు. ఖైరున్నీసా కావాలనే తమ ఆర్పీపై ఫిర్యాదు చేసిందని ఆమెను రాము గ్రూపునుంచి తొలగించామని అందుకే ఇలా చేస్తోందని తెలిపారు. ఇదే విషయమై స్థానిక మెప్మా నిర్వాహకులు ఉమేష్‌ను వివరణ కోరగా సంఘంలో తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించని సభ్యురాలిని తొలగించే అధికారం ఆ గ్రూపువారికే ఉంటుందన్నారు.



పీడీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు ఖైరున్నీసా

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన చిత్తూరు జిల్లా జట్టు క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్రస్థాయిలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించిన రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీలు విశాఖపట్టణం అల్వార్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ పోటీలకు చిత్తూరు జిల్లా నుంచి అండర్–11, 14, 17 బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. జిల్లా నుంచి పాల్గొన్న జట్లు రోల్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ చాటి బహుమతులు సాధించారు. జిల్లా తరఫున పాల్గొన్న అండర్–11 బాలుర కేటగిరీలో– బంగారుపతకం, అండర్–11 బాలికల కేటగిరీలో వెండిపతకం, అండర్–17 బాలుర కేటగిరీలో కాంస్యపతకం సాధించి ప్రతిభ చాటారు. ఎంపికైన జిల్లా జట్లు త్వరలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటాయి. ఈ జట్లలోని క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన కోచ్ కార్తీక్‌ను పలువురు అభినందించారు.

మెడికల్ దందాపై దాడులు

- జీడీనెల్లూరులో క్లినిక్‌లలో డీఎంఅండ్ హెచ్‌ఓ తనిఖీలు
- వెలుగులోకి అనుమతుల్లేని క్లినిక్‌లు
- అర్హత లేకుండా వైద్యం చేస్తున్నారని గుర్తింపు

సాక్షి ఎఫెక్ట్..

గంగాధరనెల్లూరు: మెడికల్ షాపులు, క్లినిక్‌లపై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి, ఇతర సిబ్బంది మెరుపు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో అనుమతి లేకుండా క్లినిక్‌లు నిర్వహణ, అర్హత లేకుండా వైద్యం చేస్తున్నవారి గుట్టురట్టు చేశారు. ఈ నెల 12వ తేదీన సాక్షి దినపత్రికలో 'అంతుచిక్కని రోగాలు.. అడ్రస్ లేని ఆస్పత్రులు' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. ప్రైవేటు ఆస్పత్రులపై వరుసగా దాడులు చేస్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని క్లినిక్‌లలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పలు మందుల షాపులలో ఆర్ఎంపీ సర్టిఫికెట్ లేకుండా కూడా వైద్యం చేస్తున్నారని వెలుగులోకి వచ్చింది. సూది మందులు వేస్తున్నారని, సెలైన్లు పెడుతున్నారని, గాయపడిన వారికి కూడా కుట్లు వేస్తున్నారని గుర్తించారు. తనకు డాక్టరేట్ ఉందని, అందుకే వైద్యం చేస్తున్నానని ఓ వ్యక్తి చెప్పడంతో అధికారులు అవాక్కయ్యారు. కనీస విద్యార్హత లేకుండా ఇలాంటి చర్యలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందుల షాపు పేరుతో క్లినిక్‌లు నిర్వహిస్తే కేసులు తప్పవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీ సర్టిఫికెట్లు ఉంటేనే ప్రథమ చికిత్స మాత్రం చేసుకోవచ్చని తెలిపారు.



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి దేవి

నిర్లక్ష్యం వీడండి

అనంతరం జీడీ నెల్లూరు పీహెచ్‌సీని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల అమలు తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. పలు రిజిస్టర్లు పరిశీలించారు. వైద్యులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఇలా చేస్తే ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే అవసరం ప్రజలకు రాదని తెలిపారు. ప్రభుత్వ వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా మండల కేంద్రంలోని క్లినిక్‌ల నిర్వాహకులు రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జీడీనెల్లూరులో పలు మందుల షాపులలో వైద్యం చేస్తున్నారని గమనించామన్నారు. ఒక్క వారం గడువు ఇచ్చామన్నారు. ఈలోగా ఎవరైనా అనుమతులు లేకుండా వైద్యం చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

- ఫ్యాన్లు, గ్యాస్ సిలిండర్లు ఎత్తుకెళ్లిన నలుగురి అరెస్టు

శ్రీరంగరాజపురం: ప్రభుత్వ పాఠశాలలో 24 ఫ్యాన్లు, రెండు వంట గ్యాస్ సిలిండర్లను చోరీ చేసిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రాజాకుళ్లాయప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆరిమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల జూన్ 5వ తేదీన గోపి, అతని స్నేహితులు మురళి, నాగరాజు, జ్యోతి తాగుడుకు బానిసై పాఠశాలలో చోరీకి పాల్పడ్డారు. తలుపులను పగలగొట్టి 24 సీలింగ్ ఫ్యాన్లు, రెండు గ్యాస్ సిలిండర్లను దొంగిలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం మెదవాడ గ్రామం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించిన పోలీసులు ఆటోలో తరలిస్తున్న ఫ్యాన్లపై నిందితులను విచారించారు. పాఠశాలలో దొంగిలించినట్లు తేల్చారు. వారి వద్దనుంచి 21 ఫ్యాన్‌లను, రెండు సిలిండర్లను రికవరీ చేసి పాఠశాలకు అప్పగించారు. అనంతరం వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



పాఠశాలలో చోరీ చేసిన నిందితులు

కడా ప్రాజెక్టు ఉద్యోగాల భర్తీలో గోల్‌మాల్?

- పోస్టుల భర్తీ అనంతరం నోటిఫికేషన్!

కుప్పం: కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రాజెక్టులో సిబ్బంది నియామకాల్లో గోల్‌మాల్ జరిగింది. కడా ప్రాజెక్టులో పనిచేసేందుకు 19 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఏడుగురు అనుభవజ్ఞులను డిప్యూటేషన్ పద్ధతిలో నియమించారు. మిగిలిన 12 పోస్టులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకోవాల్సిన బాధ్యత ప్రాజెక్టు డైరెక్టర్‌దే. ఈ క్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు 2, అటెండర్లు 4, డ్రైవర్లు 2, పీఎంయూ టీమ్ సభ్యులు 2, వాచ్‌మెన్ 2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. వారం రోజుల క్రితం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కడా కార్యాలయం నుంచి ప్రకటన ఇచ్చారు. దీంతో కుప్పం నియోజకవర్గం నుంచి 280 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ మంగళవారం కుప్పంలోని కడా ప్రాజెక్టు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 180 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.



కడా ప్రాజెక్టు కార్యాలయంలో ఇంటర్వ్యూలు

ముందే పోస్టుల భర్తీ?

కడా ప్రాజెక్టులో మంజూరైన ఔట్‌సోర్సింగ్ పోస్టులను ఇప్పటికే అధికార పార్టీ నేతలు తమకు అనుకూలమైన వ్యక్తులను నియమించుకున్నారని తెలిసింది. ముందస్తుగా పోస్టులు భర్తీ చేసుకుని ఆ తర్వాత ఇంటర్వ్యూలు పెట్టి నిరుద్యోగులను మోసం చేయడం తగదని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్‌మర్మత్‌ను వివరణ కోరగా ఇప్పటివరకు ఎవరినీ నియమించలేదని, ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారినే నియమిస్తామని చెప్పారు.

నాణ్యత పాటించని హోటళ్లకు జరిమానా

పుత్తూరు: పట్టణంలోని హోటళ్లు, జ్యూస్, టీ షాపుల్లో మున్సిపల్ అధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ స్థానిక ఖతిజ హోటల్‌లో కుళ్లిన ఆహార పదార్థాలను గుర్తించి రూ.5 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. పలు టీ దుకాణాల్లో నాణ్యత లేని టీ కప్పును సీజ్ చేశామన్నారు. రోడ్లపై చెత్తను వేస్తున్న షాపు యజమానులను గుర్తించి, షాపుల్లో చెత్త బుట్టలు బుధవారంలోపు ఏర్పాటు చేయాలని, లేకుంటే జరిమానా విధించడంతో పాటు షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించినట్లు వెల్లడించారు. అనంతరం శ్మశాన వాటికలోని క్రిమాటోరియంలోని గ్యాస్ బర్నర్స్ పనితీరును పరిశీలించారు. బజారువీధి, ఎంబీ రోడ్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను, వాటర్ పైప్‌లను పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.



టీషాపు యజమానిని హెచ్చరిస్తున్న కమిషనర్

పారిశుధ్యంపై డీపీఓ అసంతృప్తి

విజయపురం: పారిశుధ్య పనులపై డీపీఓ లక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం పన్నూరు దళితవాడలో ఆమె పర్యటించారు. పారిశుధ్యంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా మురుగు కాలువలను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగుపరచాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ క్లోరినేషన్, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్య పనులు జరిగినట్లు ఎక్కడా కనిపించలేదని, ఇక ఉపేక్షించేది లేదని కార్యదర్శులను హెచ్చరించారు. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



విజయపురం : పన్నూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ

స్వచ్ఛందంగానే రూ.100 ఇచ్చాం

పలమనేరు: ఏపీ రాజధాని నిర్మాణం కోసం జిల్లాలోని గ్రూపుల్లోని ప్రతి సభ్యురాలు వందేసి స్వచ్ఛందంగానే ఇచ్చామని జిల్లా సమాఖ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలు తీర్మానం కూడా చేశాయని పేర్కొన్నారు. ఓ మహిళా డబ్బులివ్వు అని సాక్షి దినపత్రికలో వెలువడిన కథనంపై తాము స్పందించామని తెలిపారు. తామంతా స్వచ్ఛందంగా ఎవరి ఒత్తిడి లేకుండా రాజధాని నిర్మాణానికి తమ వంతు చిరు సాయంగా ఇచ్చామని తెలిపారు.

